క్లుప్తంగా

శ్రీలక్ష్మీ వారాహి దేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీశక్తిపీఠంలో జరుగుతున్న వారాహీ నవరాత్రులలో భాగంగా ఆలయంలో కొలువైన శ్రీ శ్వేత వారాహిదేవి అమ్మవారు శుక్రవారం శ్రీలక్ష్మీ వారాహి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకుడు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీ పీఠంలో కొలువైన వారాహి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ సుగంధ భరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో, పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ క్రమంలోనే వేదపండితులు శ్రీలక్ష్మీ వారాహి దేవి మంత్రాలతో హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు పూజలో పాల్గొన్న భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు.

మండల స్థాయి సమీక్షా సమావేశం

రామచంద్రాపురం: మండల పరిషత్ కార్యాలయంలో అధికారులలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా మంజూరైన నిధులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చిగురువాడ నుంచి రాయలచెరువు కట్ట వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా హౌసింగ్ బిల్లులను లబ్ధిదారులకు అందించాలని హౌసింగ్ ఏఈ మహేశ్వర్ నాయుడును ఆదేశించారు. ఎంపీడీఓ ప్రత్యూష, తహశీల్దార్ ఉషారాణి, ఆర్ అండ్ బీ డీఈ సూర్య నారాయణరెడ్డి, పీఆర్ డీఈ సేతుమాధవ్, సీడీపీఓ జ్యోతి, ఎంఈఓలు మార్కండేయనాయుడు, జయవేలు, ఏపీఎం రాధమ్మ, ఏపీఓ హంసవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించాలి



మిట్టపాళెం సచివాలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చంద్రగిరి: ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ద్వారా సులభతరంగా చికిత్స అందించవచ్చునని చంద్రగిరి, మిట్టపాళెం మెడికల్ అధికారులు డాక్టర్ సుజిత, కుసుమ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మిట్టపాళెం, చంద్రగిరిలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో శుక్రవారం టీటీడీ స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సు క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, 104 సిబ్బంది, స్విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

తిరుపతి(అలిపిరి): బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక మిట్టవీధిలోని బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు అనుబంధమైన ఏపీ బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో బ్రాహ్మణులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రుణ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తమ నివాసాలకు పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు హనుమంతరావు, అజయ్‌కుమార్ , భాగవతులు జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మలాలా యువతకు స్ఫూర్తి



మాట్లాడుతున్న తిరుపతి బాలోత్సవం అధ్యక్షుడు నడ్డి నారాయణ


తిరుపతి కల్చరల్: ఆడపిల్లల చదువు కోసం అలుపెరగని పోరాటం చేసి అతి చిన్న వయసులోనే నోబెల్ బహుమతి అందుకున్న మలాలా నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తిరుపతి బాలోత్సవం అధ్యక్షుడు నడ్డి నారాయణ తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సావిత్రిబాయిపూలే ట్యూషన్ సెంటర్‌లో శుక్రవారం మలాలా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి బాలోత్సవం ప్రతినిధులు గురునాథం, మల్లారపు నాగార్జున, ట్యూషన్ సెంటర్ టీచర్లు చంద్రశేఖర్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోహరం.. మంచు సోయగం



ఇటీవల కురుస్తున్న వర్షాలతో శేషాచలం కొండలను మంచు తెరలు మనోహరంగా కమ్ముకున్నాయి. అడవుల్లోని పచ్చదనం, మంచు శ్రీవారి భక్తులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొండల్లోని మంచు తెరల అందాలను శ్రీవారి భక్తులు వారి సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





నిధుల దుర్వినియోగంపై విచారణ



చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి: పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను శుక్రవారం పరిశీలించారు. చంద్రగిరి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారంటూ గుర్తు తెలియని వ్యక్తి ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ వెంటనే ఫిర్యాదును పరిశీలించి, నిజాలను వెలికి తీయాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో గూడూరు డీఎల్‌పీఓ వెంకట రమణ, చంద్రగిరి ఈఓపీఆర్డీ శశిరేఖతో కలసి ఆయన పంచాయతీ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నమోదు చేసుకున్నారు. వివరాలను పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్యను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పంచాయతీ పన్నుల వసూలు, ఇళ్లు, లే అవుట్‌ల అప్రూవల్ తదితరాలకు సంబంధించిన రికార్డులను కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం కార్యదర్శి స్టేట్‌మెంట్‌ను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యాలయంలోని కొన్ని రికార్డులను వారి వెంట తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ..జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఫిర్యాదు రావడంతో రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



పారిశుధ్య కార్మికుల నూతన కమిటీ

తిరుపతి తుడా: ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పని చేసే పారిశుధ్య కార్మికుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర నేతృత్వంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల శ్రమ దోపిడీని దృష్టిలో ఉంచుకుని నూతన కమిటీని నియమించినట్లు తెలిపారు. కనీస వేతనాల అమలు, ప్రతినెలా వేతనాల చెల్లింపు, పీఎఫ్ అమలు వంటి అంశాల అమలే లక్ష్యంగా కమిటీ పని చేస్తుందన్నారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌కు అనుబంధంగా కమిటీ ఉంటుందన్నారు. అధ్యక్షురాలిగా గుర్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా వనజ, కోశాధికారిగా నాగజ్యోతిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా లక్ష్మీ, హంసబాయ్, ఎం.పద్మజ, అన్నపూర్ణ, లీల, మునిరాజమ్మ, సంయుక్త కార్యదర్శిగా దీప, కవిత, రోజా, శాంతితోపాటు మరో 12 మంది సభ్యులుగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

పీజీ విద్యార్థులకు ఘన వీడ్కోలు



వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: కొండారెడ్డి రాయలసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్(రిమ్స్) కళాశాలలో శుక్రవారం ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన పీజీ విద్యార్థులకు అధ్యాపకులు, జూనియర్స్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీవనంలో ప్రతి అడుగు ఒక గుణపాఠంగా భావించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం జూనియర్ విద్యార్థులు సీనియర్లకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు నిరంజన్‌రెడ్డి, మధుర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు







తిరుమల శ్రీవారి దర్శించుకున్న శ్రీ సిటీ చైర్మన్ శ్రీనివాసరాజు, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, సంగీత దర్శకుడు తమన్, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

తిరుమల: శ్రీవారిని శుక్రవారం శ్రీసిటీ చైర్మన్ శ్రీనివాసరాజు, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన బ్రిడ్జ్ కోర్సు



బ్రిడ్జ్ కోర్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో నూతనంగా పీజీ, యూజీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బ్రిడ్జ్ కోర్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజినీకాంత శుక్లా మాట్లాడుతూ సంస్కృత వర్సిటీలో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 15 శాస్త్రాల్లో ఉన్న ప్రధాన విషయాలను విద్యార్థులకు బోధించామన్నారు. ఈ కార్యక్రమంలో సారస్వతాతిథి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.రంగనాథ, డాక్టర్ యశస్వీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలో పలు విద్యుత్ ఉప కేంద్రాల్లోనూ, విద్యుత్ లైన్ల నిర్వహణ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాజీవ్ గాంధీ కాలనీ, ఎస్ఎల్‌వీ నగర్, శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్, శివజ్యోతి నగర్, ఉపాధ్యాయ నగర్, శ్రీనగర్ కాలనీ, సంజయ్ గాంధీ కాలనీ, మారుతీ నగర్, లీలామహల్ సర్కిల్, చింతలచేను, కొత్తపల్లి, సుబ్బారెడ్డి నగర్, సుభాష్ నగర్, ఆర్టీసీ బస్టాండ్, పీకే లేఅవుట్, న్యూ బాలాజీ కాలనీ, ముత్యాలరెడ్డి పల్లి జంక్షన్, బాటా షోరూం, బాలాజీ కాలనీ, ఇందిరానగర్, కుమ్మరతోపు, ఎల్‌బీసీ రోడ్డు, నెహ్రూ నగర్, బొమ్మగుంట, పీపీ చావడి, నరసింహ తీర్థం రోడ్డు, పట్నాలు వీధి, టౌన్ క్లబ్ రోడ్డు, చిన్న బజార్, పోలీస్ క్వార్టర్స్, కోర్టు ఏరియా, రిజర్వాయర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా టీకాప్ టెక్ సమ్మిట్

తిరుపతి(అలిపిరి): టీకాప్ ఆధ్వర్యంలో విజన్ ఐటీ 3.ఓ టెక్ సమ్మిట్ శుక్రవారం సాయంత్రం శిల్పారామం సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఐటీ పరిశ్రమలకు వెంటనే అనుమతులు ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే పరిశ్రమలు ఉన్నాయని.. కొత్త పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఎస్వీయూ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ విజయ్‌భాస్కర్‌రావు, టీకాప్ అధ్యక్షుడు వంశీ, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మందుబాబులకు జైలు

తిరుపతి కల్చరల్: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికీ రెండు రోజులు జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధిశ్రీనివాస్ శుక్రవారం తీర్పుచెప్పారు. ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుపతిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. అధికంగా మద్యం తాగి వాహనం నడుపుతున్న రామచంద్రపురానికి చెందిన కె.సుబ్రమణ్యం, ఎంఆర్ పల్లికి చెందిన ఆటో డ్రైవర్ ఏ.కృష్ణ, గిరిపురానికి చెందిన సి.రామకృష్ణకు రెండు రోజులు చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికీ పది వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. అలాగే అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఒకరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వైభవంగా పరాశరేశ్వరస్వామి కల్యాణం

నారాయణవనం: టీటీడీ అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం దేవరులకు ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పరాశరేశ్వర స్వామివారు రాత్రి అశ్వవాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరించారు. ఉదయం అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు పూర్తి చేశారు. పరివార దేవతలకు అభిషేకాలు, హోమశాలలో హోమాలు, నైవేద్య సమర్పణ చేశారు.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి



ఇళ్లల్లో నీటి నిల్వలపై తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడం ద్వారా డెంగీ, మలేరియా వంటి అంటువ్యాధులను అరికట్టవచ్చని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఈ నెల 1 నుండి 31 వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఫ్రైడే డ్రైడే అమలుపై క్షేత్రస్థాయిలో ఆమె శుక్రవారం పర్యటించారు. ఇంజినీరింగ్, హెల్త్ అధికారులు, సిబ్బందితో కలసి కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు ఉండే ప్రాంతాలే దోమలకు ఆవాసాలని తెలిపారు. ప్రతి రోజూ కాచిన నీరు తాగడం మంచిదని అన్నారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి రెడ్డి, డీఈఈలు మహేష్, శ్రావణి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నరసింగాపురంలో డ్రై డే

చంద్రగిరి: నరసింగాపురం పంచాయతీలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ నరసింహులు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది గ్రామంలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. మురుగు, వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చేశారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఫ్రైడే.. డ్రైడేపై అవగాహన

పాకాల: అన్ని పంచాయతీల్లో ఫ్రైడే.. డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఈఓపీఆర్డీ మాలతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటపల్లి, సామిరెడ్డిపల్లి, ఇరంగారిపల్లి పంచాయతీలను ఆమె సందర్శించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో దోమల వలన సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద ఉన్న నీటి సంపులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చేయించారు. గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, ఉమామహేశ్వర్, పుష్పలత, ఎంసీఓ వనజ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



నరసింగాపురంలో నిల్వ నీటి తొలగింపు



నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి



ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ బాబ్జి

పాకాల: ప్రైవేట్ పాఠశాలల వారు నడిపే బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని ఎంఈఓ బాబ్జి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో ఎన్ని సీట్లు ఉన్నాయో అంత మందిని మాత్రమే ఎక్కించి సురక్షితంగా విద్యార్థులను తీసుకుని రావాలని సూచించారు. అలాగే విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజుల వివరాల నోటీస్ బోర్డులో ఉంచాలని, పాఠశాలల్లో ఎలాంటి టెక్స్‌బుక్స్, వర్క్‌బుక్స్‌ను అమ్మరాదని పేర్కొన్నారు. ఫీజులు కట్టలేదని విద్యార్థులపై మానసికంగా, శారీరకంగా దండన ఉండరాదన్నారు. తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెట్టకూడదని వివరించారు. ముందస్తు అనుమతి లేనిదే పాఠశాల పేరు మార్చరాదని, తల్లిదండ్రులు, విద్యార్థులు అడిగిన వెంటనే టీసీలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 లింగయ్య, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎల్‌సీసీ చిత్రం షూటింగ్ ప్రారంభం



ఏఎల్‌సీసీ సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్న పండితులు, దర్శకులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఏఎల్‌సీసీ చిత్రం యూనిట్ శుక్రవారం హల్‌చల్ చేసింది. వర్సిటీలోని పూరిజగన్నాథ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చిత్రం షూటింగ్ ప్రక్రియను పండితులు క్లాప్ కొట్టి ప్రారంభించారు. అనంతరం చిత్ర దర్శకుడు కోలా లీలాధర్‌రావు మాట్లాడుతూ తిరుపతి వాస్తవ్యుడిగా వర్సిటీలో జగన్నాథ స్వామి ఆశీస్సులతో ఏఎల్‌సీసీ చిత్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో 22 రోజుల పాటు సినిమా షూటింగ్ ఉంటుందని తెలిపారు.

అంత్యక్రియలకు అటవీ శాఖ అడ్డు



అటవీ భూమిలో శవాలు పూడ్చరాదని గ్రామస్తులను అడ్డుకుంటున్న అధికారులు

తిరుపతి మంగళం: తిరుపతి నగర పరిధి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాలెం హరిజనవాడలో గురువారం చనిపోయిన యువకుడి అంతిమ సంస్కారాల కోసం గ్రామస్తులు చేసిన ప్రయత్నాలను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అటవీ భూమి చుట్టుపక్కల లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుని కాపురం ఉంటున్న స్థానికులు కూడా అభ్యంతరాలు తెలిపారు. తిమ్మినాయుడుపాళెం గ్రామస్తులకు ఇదివరకు ఉన్న శ్మశాన స్థలం ఏమైందని ప్రశ్నించారు. దీంతో శ్మశాన స్థలం సమస్యను స్థానిక టీడీపీ నాయకుడు వెంకటరత్నం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకుని వెళ్లారు. ఇరువురూ డీఏఓ సతీష్‌రెడ్డితో చర్చించి, భూమి కేటాయింపునకు సంబంధించిన నిర్ణయం వెలువడేంత వరకు గ్రామస్తులకు సహకరించాలని సూచించారు. దీంతో సమస్య తాత్కాలికంగా తీరింది. అయితే ఇకపై అనుమతులు లేకుండా శవాలను తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపితే చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

మానసిక రోగులకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి పీఆర్ రాజీవ్

తిరుపతి తుడా: మానసిక రోగులకు నాణ్యమైన వైద్యంతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ పని చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి పీఆర్.రాజీవ్ తెలిపారు. మానసిక రోగుల సంరక్షణ కోసం నియమితులైన ఈ కమిటీ శుక్రవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక రోగులకు నాణ్యమైన వైద్యం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నాలుగు కమిటీలను నియమించిందన్నారు. విశాఖపట్నం విజయవాడ తిరుపతి వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రంగా ఈ కమిటీలు పనిచేస్తాయన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల పర్యవేక్షణకు వేసిన బోర్డుకి ప్రభుత్వం తనను చైర్మన్‌గా నియమించిందని ఆయన తెలిపారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్, మానసిక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రుష్యేంద్ర , స్వచ్ఛంద సంస్థల నుంచి భూపాల్ నాయుడు, తాయారు మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ సభ్యులుగా ఉంటారని చెప్పారు . మానసిక రోగుల సహాయకులు ఎవరైనా వారికి చికిత్స, సౌకర్యాలపై తమ దృష్టికి తీసుకువస్తే వారికి మెరుగైన సేవలు అందించేందుకు ఈ బోర్డు కృషి చేస్తుందని తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ బోర్డు సభ్యులు తాయారు, భూపాల్ నాయుడు పాల్గొన్నారు.